రాత్రయితే.. అంధకారమే

రోజుల తరబడి వెలగని వీధి దీపాలు

రాత్రివేళల్లో కాలనీవాసులకు ఇబ్బందులు

పెచ్చుమీరుతున్న ఆకతాయిల ఆగడాలు

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

వెంగళరావునగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొదలుకుని మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు చెబుతున్నా మరోవైపు నగరంలోని కాలనీలు, బస్తీలు అంధకారంలో మగ్గుతున్నాయి. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు, కాలనీలు, బస్తీల్లో ఎల్‌ఈడీ వీధి దీపాల వెలుగులు చిమ్ముతాయని అధికారులు, ప్రజాప్రతినిధులు అంటున్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని వెంగళరావు నగర్, యూసుఫ్ గూడ, రహ్మత్ నగర్, ఎర్రగడ్డ, బోరబండ, షేక్‌పేట డివిజన్లలోని పలు ప్రాంతాల్లో సుమారు 16 వేలకు పైగా వీధి దీపాలు ఉన్నా కొన్ని రోజులుగా వెలగడం లేదు. దీంతో రాత్రివేళల్లో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చీకట్లో ఆకతాయిల ఆగడాలు, అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి, తెల్లవారుజామున వీధుల్లో నడవాలన్నా, వాహనం నడపాలన్నా ఎక్కడి నుంచి శునకాలు వచ్చి దాడి చేస్తాయోనని, దొంగలు ఎక్కడ దోపిడీ చేస్తారోనని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. వివిధ కారణాలతో కొన్ని రోజులుగా వెలగని, పాడైన వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టడం లేదు. సింగపూర్ పోల్స్ ఎత్తుగా ఉన్నాయని, భారీ నిచ్చెన లేకపోవడంతో పాటు పరికరాలు లేక, దీపాలు లేక ఇబ్బందులు తప్పడం లేదని సిబ్బంది వాపోతున్నారు. వెంగళరావునగర్ డివిజన్‌లోని మధురానగర్, వెంగళరావునగర్, సిద్ధార్థ నగర్, కళ్యాణ్ నగర్, రహ్మత్ నగర్, యాదగిరి నగర్, జవహర్ నగర్‌లో సుమారు 700కు పైగా ఎల్‌ఈడీ వీధి దీపాలు ఉన్నాయి. ఇందులో వందకు పైగా వెలగడం లేదు.



చీకటిలో మధురానగర్ డి-బ్లాక్‌లోని ఓ రహదారి



వెంగళరావునగర్ అయ్యప్ప మైదానం రహదారిలో వెలగని వీధి దీపం

ఆరు దాటిందంటే అంతే..

సాయంత్రం ఆరు దాటిందంటే కొన్ని ప్రాంతాల్లో చిమ్మచీకట్లు స్థానికులకు ఇక్కట్లను తెచ్చిపెడుతున్నాయి. మధురానగర్‌లో సుమారు 350, వెంగళరావు నగర్‌లో సుమారు 200 వరకు వీధి దీపాలు ఉన్నాయి. వీటిలో వందకు పైగా వెలగడం లేదు. కాలనీలో వీధి దీపాల కిందనే వృక్షాలు ఉండడంతో వీధి దీపాల కాంతి రహదారిపై పడడం లేదు. వీధి దీపాలు వెలగక పోవడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రయిందంటే ఆయా ప్రాంతాల్లో చీకట్లు అలముకోవడంతో ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. పలు రహదారుల్లో కుక్కలు కూడా వెంట పడి తరుముతుండడంతో చీకట్లో మహిళలు, వృద్ధులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

పెచ్చుమీరుతున్న ఆకతాయిల ఆగడాలు

ప్రధాన రహదారులు, కాలనీలు, బస్తీల్లో వీధి దీపాలు సరిగా వెలగకపోవడంతో జులాయిలు, ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. మద్యం, గంజాయి మత్తులో అలజడి సృష్టిస్తున్నారు. దారిన పోయేవారితో గొడవలకు దిగుతూ దాడులు చేస్తున్నారు. ఖాళీ, చీకటి ప్రదేశాలను మద్యం, గంజాయి బ్యాచ్‌లు అడ్డాగా మార్చుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వారి ఆగడాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.



మధురానగర్ డి-బ్లాక్‌లో వెలగని వీధి దీపం

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



వెంగళరావునగర్ కాలనీలో సుమారు 140 వరకు వీధి దీపాలు ఉన్నాయి. వాటిలో కొన్ని వెలగడం లేదు. కాలనీవాసులు వీధి దీపాలు వెలగడం లేదని మాకు ఫిర్యాదు చేస్తున్నారు. మేము సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదు. స్థానికులు మమ్మల్ని నిలదీస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి.

\- చిలకల వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు, వెంగళరావునగర్ సంక్షేమ సమితి

ప్రమాదాలు జరుగుతున్నాయి..



మధురానగర్ కాలనీలో సుమారు 350 వరకు వీధి దీపాలు ఉన్నాయి.అందులో కొన్ని వెలగడం లేదు. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలి.

\- కోడె సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి, మధురానగర్ సంక్షేమ సమితి

ఎడతెరిపి లేని వాన

● టెలిఫోన్ భవన్ మార్గంలో భారీగా నిలిచిన వర్షం నీరు ● పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం

ఖైరతాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో నగరవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముసురు పడుతూనే అప్పుడప్పుడు భారీగా, ఓ మోస్తరుగా వర్షం పడడంతో కొన్నిచోట్ల రోడ్లపై వర్షంనీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. లక్డీకాపూల్ టెలిఫోన్ భవన్ మార్గంలో రోడ్డుపై వర్షం నీరు భారీగా నిలిచింది. పలుచోట్ల ఇటీవలే ఏర్పాటైన ఇంజక్షన్ బోర్లు సత్ఫలితాలనిస్తున్నట్లే చెప్పవచ్చు. లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్, మోడల్ హౌస్, మైత్రీవనం చౌరస్తా, కేసీపీ చౌరస్తా, సచివాలయం బస్టాపు తదితర ప్రాంతాల్లో భారీ వర్షం వచ్చినా, కొంత సమయంలో నీరు ఇంకుడు గుంతల్లోకి వెళ్తున్నాయి. అతి భారీ వర్షాలు పడితే మాత్రం ఇబ్బందులు తప్పేలా లేవు. కాగా, క్యాచ్ పీట్లు, కచ్చామోరీల వద్ద, నీరు నిలిచే ప్రాంతాల్లో ప్రత్యేక సిబ్బందిని నియమించి అక్కడ ఎప్పటికప్పుడు వచ్చే చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తూ నీరు ఇంకేలా జీహెచ్‌ఎంసీ సిబ్బంది పనిచేస్తున్నారు. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో పాటు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్ల ఉప కమిషనర్లు పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.



టెలిఫోన్ భవన్ రోడ్డులో నీరు తొలగిస్తున్న సిబ్బంది



వర్షం నీటిని తొలగిస్తున్న సిబ్బంది

మాదాపూర్‌లో ట్రాఫిక్‌జామ్



మాదాపూర్ ప్రధాన రహదారిలో ట్రాఫిక్‌జామ్

హైటెక్ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వర్షం కారణంగా శుక్రవారం సాయంత్రం మాదాపూర్ ప్రధాన రహదారిలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. రత్నదీప్ సూపర్ మార్కెట్ సమీపంలో యూటర్న్ ఉండడంతో వాహనాలు బారులు తీరాయి. ట్రాఫిక్ పోలీసులు వాహనాలు సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. బస్సులను బస్టాప్‌కు కొంతదూరంలో ఆపేలా చేశారు.

వాన నీటిని నాలాల్లోకి మళ్లించాలి

యూసుఫ్‌గూడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా, ప్రజా రవాణా వ్యవస్థ సాఫీగా సాగేలా అధికారులు సిబ్బందితో ఎప్పటి కప్పుడు చర్యలు చేపట్టాలని సర్కిల్-19 డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం కృష్ణానగర్ బీ, సీ బ్లాక్‌లలో జీహెచ్‌ఎంసీ ఏఈ అవినాష్, సంతోష్ సిబ్బందితో పర్యటించారు. రోడ్లపై నిలిచిన వర్షం నీరు సక్రమంగా నాలాలోకి పోయేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుం న్నారు. డ్రైనేజీ నాలాపై ఉన్న మ్యాన్‌హోల్ రంధ్రాల్లో పేరుకుపోయిన చెత్తను సిబ్బంది తొలగించారు. పొంగుతున్న డ్రైనేజీ మురుగును ఇంజన్‌లతో శుభ్రం చేస్తూ రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.



కృష్ణానగర్‌లో వర్షం నీరు పోయేలా చేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

నాలా మరమ్మతు పనులు ప్రారంభించండి

● హైడ్రా కమిషనర్ రంగనాథ్

బంజారాహిల్స్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నాలా మరమ్మతు పనులు వెంటనే ప్రారంభించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఫిలింనగర్ బసవతారక నగర్‌లోని నాలా పొంగి వరదనీరు బస్తీని ముంచెత్తుతోంది. విషయం తెలుసుకున్న రంగనాథ్ స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌తో కలిసి బస్తీలో శుక్రవారం పర్యటించారు. స్థానికులతో మాట్లాడారు. నాలాను పరిశీలించారు. వరదనీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్తను తొలగించి నాలాకు మరమ్మతులు చేపట్టాలని సిబ్బందికి ఆయన సూచించారు.



బసవతారకం నగర్‌లో పర్యటిస్తున్న రంగనాథ్, కార్పొరేటర్ వెంకటేష్

రోడ్లపై అక్రమ పార్కింగ్ వాహనాల తొలగింపు



కారును తొలగిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

బంజారాహిల్స్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేస్తే సహించేది లేదని పశ్చిమ మండలం ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరి ప్రసాద్ హెచ్చరించారు. బంజారాహిల్స్‌లోని పలు రోడ్లపై పాతబడిన కార్లతోపాటు ఇతర వాహనాలను రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేయడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయనే ఫిర్యాదుల మేరకు ఆయన శుక్రవారం తనిఖీలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో కారు మెకానిక్‌లు పాతబడిన కార్లను రోడ్లమీదనే పా ర్కింగ్ చేయడం వల్ల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడుతున్నట్లు గు ర్తించి వాటిని తొలగించారు. ఇకమీదట వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

క్రీడాస్ఫూర్తి, వ్యక్తిత్వాన్ని ప్రాధాన్యంగా చూడాలి



బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తలపడుతున్న క్రీడాకారులు

యూసుఫ్‌గూడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు స్కోర్లు, ట్రోఫీల కంటే క్రీడాస్ఫూర్తి, శ్రమ, వ్యక్తిత్వాన్ని ప్రాధాన్యంగా చూడాలని తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కోశాధికారి కె.వంశీధర్, అసిస్టెంట్ సెక్రటరీ పి.ఎల్.వి.కుమార్ అన్నారు. పవర్ గ్రిడ్ సథరన్ రీజియన్-1, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కె.వి.బి.ఆర్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న అంతర్ ప్రాంత బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2025ను వారు శుక్రవారం ప్రారంభించారు. పవర్ గ్రిడ్ ప్రాంతాల నుంచి కార్పొరేట్ సెంటర్, నార్త్ రీజియన్-1,2,3, నార్త్, ఈస్ట్ రీజియన్, సథరన్ రీజియన్-1, సథరన్ రీజియన్-2, వెస్ట్ రీజియన్-1, వెస్ట్ రీజియన్-2 జట్లు తలపడ్డాయి. నేడు ఫైనల్ పోటీలు జరగ నున్నాయి. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



సుగుణదేవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బండి సంజయ్

పీసీసీ మాజీ అధ్యక్షుడి నివాసానికి కేంద్ర మంత్రి

హైదరాబాద్ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేకించి సొంత జిల్లా కరీంనగర్ అభివృద్ధిలో తనదైన ముద్రవేసిన ఎమ్మెస్సార్‌కు జీవితాంతం సుగుణదేవి తోడూ నీడగా నిలిచారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని పీసీసీ మాజీ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణరావు నివాసానికి వెళ్లి ఇటీవల మరణించిన ఆయన సతీమణి సుగుణదేవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెస్సార్ కుటుంబసభ్యులను పరామర్శించి మనోధైర్యం చెప్పారు.



బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని ఢిల్లీలోని తల్కాతోరా స్టేడియంలో నిర్వహించిన భాగిదారి న్యాయ సమ్మేళనంలో పాల్గొన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, వనం సంగీతయాదవ్ తదితరులు

● బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి



రామస్వామికి ప్రజల కథే నా ఆత్మకథ పుస్తకాన్ని బహూకరిస్తున్న దత్తాత్రేయ

బీజేపీ జ్యేష్ఠ నాయకుడిని కలిసిన దత్తాత్రేయ

ఖైరతాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనసంఘ్ స్థాపన నుంచి బీజేపీలో చురుకైన నాయకుడిగా పనిచేసిన జ్యేష్ఠ నాయకుడు దుగ్గల రామస్వామిని ఆయన నివాసంలో హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కలిశారు. ఖైరతాబాద్ ఆనంద్‌నగర్ కాలనీలోని ఆయన ఇంట్లో దత్తాత్రేయ దాదాపు అరగంటకు పైగా గడిపారు. అప్పట్లో కలిసి పనిచేసిన విషయాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ ప్రజల కథే నా ఆత్మ కథ పుస్తకాన్ని రామస్వామికి బహూకరించారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు

బంజారాహిల్స్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసి ఆయన ప్రతిష్ఠకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత శుక్రవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కౌశిక్‌రెడ్డి సోషల్ మీడియా ఛానల్ అయిన తెలుగు స్క్రైబ్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డిపై తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలాంటి చర్యల వల్ల రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్య కూడా తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. పోలీసులు ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు ప్రారంభించారు.

2న సీపీఐ రంగారెడ్డి జిల్లా మహాసభ

గచ్చిబౌలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రంగారెడ్డి జిల్లా 17వ మహాసభను ఆగస్టు 2న నిర్వహిస్తున్నట్లు పార్టీ శేరిలింగంపల్లి కార్యదర్శి రామకృష్ణ, నాయకుడు చందుయాదవ్ తెలిపారు. శుక్రవారం గచ్చిబౌలి చౌరస్తాలోని ఆటో స్టాండ్‌లో జరిగిన సమావేశంలో వారు సభ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. మహాసభకు శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

కారు ఢీకొని యువకుడు మృతి



గోపాలకృష్ణ(ఫైల్)

ఖైరతాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడిని కారు ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ సంఘటన నెక్లెస్‌రోడ్డు రోటరీ చౌరస్తాలో జరిగింది. సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ పార్సిగుట్టకు చెందిన చింతపల్లి గోపాలకృష్ణ(31) సోమాజిగూడలోని ఏఐజీ ఆస్పత్రిలో ఉద్యోగి. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి తన ద్విచక్ర వాహనంపై ఉద్యోగానికి బయలుదేరాడు. నెక్లెస్ రోడ్డు రోటరీ చౌరస్తాలో ఉదయం 7 గంటల ప్రాంతంలో ఓ కారు (టిఎస్ 09 ఈవై 8571) వేగంగా వచ్చి ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కారు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని మృతుడి తల్లి సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడిపై కత్తితో దాడి

యూసుఫ్‌గూడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో యువకుడిపై కత్తితో దాడి చేసిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్‌ఐ సంజీవయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి 100కు ఫోన్ వచ్చింది. జవహర్ నగర్‌లో షేక్ తాజుద్దీన్‌పై ఎండీ అన్వర్ షరీఫ్ కత్తితో దాడి చేసి ఎడమచేతిపై గాయపరిచారు. రక్షక్ వాహనం, సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పారిపోతున్న ఇద్దరిని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళకు డబ్బులు ఎరచూపి మోసం

యూసుఫ్‌గూడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కుటుంబ ఆర్థిక ఇబ్బందులను ఆసరా చేసుకొని ఓ మహిళకు డబ్బులు ఎరచూపి శారీరకంగా వాడుకొని ఓ వ్యక్తి మోసం చేశాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్ నగర్‌కు చెందిన డాక్టర్ కోసూరు సత్యజగదీష్ ఈనెల 11న పరిచయం ఉన్న ఓ మహిళను ఒక రోజు ఏకాంతంగా గడపాలని, అందుకు మూడు లక్షలు ఇస్తానని నమ్మ బలికాడు. సదరు మహిళ కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల ఒప్పుకొని రాత్రంతా అతడితో గడిపింది. అతడు ఇచ్చిన మూడు లక్షల చెక్కు ఈనెల 14న బ్యాంక్‌లో డిపాజిట్ చేసింది. ఈనెల 16న అకౌంట్లో నగదు లేవని ఫోన్‌కు సమాచారం వచ్చింది. తిరిగి 17న మరో సారి బ్యాంక్‌కు వెళ్లి చెక్కు వేయగా చెల్లదని చెప్పారు. ఉద్దేశపూర్వకంగానే తమ అకౌంట్ లావాదేవీలను నిలిపివేసినట్లు తెలుసుకున్న సదరు మహిళ మోసపోయానని గ్రహించి శుక్రవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

బేగంపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సనత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌కు చెందిన అవినాష్ సమీపంలోని పలు మద్యంషాపుల నుంచి మద్యం కొనుగోలు చేసి వాటిని అధిక ధరలకు విక్రయిస్తుంటాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సనత్‌నగర్ పోలీసులు ఎర్రగడ్డలోని అవినాష్ ఇంట్లో సోదాలు జరపగా పెద్ద మొత్తంలో మద్యం బాటిళ్లు దొరికాయి. ఓల్డ్‌మంక్(180 ఎంల్) 8, ఓసీ మంక్ (90ఎంఎల్) 8, డైమండ్ ఫైన్ (180ఎంఎల్) 40, హైవిస్కీ (180ఎంఎల్) 5, మ్యాజిక్ మూమెంట్ (180ఎంఎల్) 15 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అవినాష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బోరబండలో ఖబరస్తాన్‌కు స్థలం కేటాయించాలి

బోరబండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బోరబండ ప్రాంతంలో ఖబరస్తాన్‌కు స్థలం కేటాయించాలని ముస్లింలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రార్థనల అనంతరం బోరబండ డివిజన్ పరిధిలోని 11 మసీదుల వద్ద ఖబరస్తాన్‌కు స్థలం కేటాయించాలని ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బోరబండ సైట్-2 కాలనీలోని పీలీదర్గా వద్ద సర్వేనెంబర్.127లో 2.16 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉన్నదని, ఇందులో ఒక ఎకరం 4గుంటల స్థలం తమకు చెందుతుందంటూ స్థానిక ఎస్‌ఆర్‌ఆర్‌పురం గృహనిర్మాణ సంఘం కోర్టులో కేసు వేసిందని తెలిపారు. మిగిలిన ఎకరం 12 గుంటల స్థలాన్ని ఖబరస్తాన్ కోసం కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇమామ్‌లతో పాటు బోరబండ ఖబరస్తాన్ కమిటీ ప్రతినిధులు సయ్యద్ ముకరం, ఎం.డి.మోయిజ్, జహంగీర్ ఖాన్, ఫయాజ్ ఖాన్, షేక్ షరీఫ్, వసీం జావెద్, ఎం.డి.యూసుఫ్, జావెద్, మునీర్, ఎం.డి.ఖాజామోయినుద్దీన్, ఎం.డి.గౌస్, ఎం.డి.యాకూబ్, ఎం.డి.ఖాదర్ పాల్గొన్నారు.

ప్రియురాలికి బెదిరింపులు

● పోలీసులను ఆశ్రయించిన యువతి

అమీర్‌పేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): 'డబ్బులు ఇస్తావా..నాతో సన్నిహితంగా దిగిన ఫొటోలు, వీడియోలు మీ కుటుంబసభ్యులకు పంపమంటావా' అంటూ ప్రియురాలిని బ్లాక్ మెయిల్ చేశాడు ప్రియుడు. దిక్కుతోచని స్థితిలో ఆ యువతి పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన యువతి(19) ఎస్.ఆర్.నగర్‌లోని ప్రైవేట్ హాస్టల్లో ఉంటూ టెలికాలర్ ఉద్యోగం చేస్తుంది. ఆరు నెలల క్రితం యువతికి తరుణ్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. కొంత కాలానికి స్నేహితులయ్యారు. యువతితో సన్నిహితంగా ఉన్న సమయంలో ఆమెకు తెలియకుండా ఫొటోలు, వీడియోలు తీసుకున్నాడు. మూడు రోజుల నుంచి డబ్బు ఇవ్వాలని.. లేకుంటే సన్నిహితంగా ఉన్న ఫొటోలు, వీడియోలు కుటుంబసభ్యులకు పంపుతానని బెదిరింపులకు గురిచేశాడు. ఆందోళనకు గురైన ఆ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్.ఆర్.నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భవిష్యవాణి ఆదేశాలు అమలు

మహాకాళి అమ్మవారికి బెల్లం, పప్పు, సాక


అమ్మవారికి సాక సమర్పిస్తున్న భక్తులు

సికింద్రాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి బోనాల జాతరలో భాగంగా రంగం కార్యక్రమంలో భవిష్యవాణి ఆదేశించిన మేరకు శ్రావణమాసం తొలి శుక్రవారం అమ్మవారికి సాక సమర్పించారు. దేవాలయం తరపున అమ్మవారికి పప్పు, బెల్లం, సాక సమర్పించి, భవిష్యవాణి ఆదేశాలను అమలు చేశారు. మరోవైపు సికింద్రాబాద్‌తోపాటు జంటనగరాల నుంచి భక్తులు తమ ఇళ్లలోనే బోనాలు, సాక తయారు చేసుకుని ఆలయానికి వచ్చి, అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భవిష్యవాణి చెప్పిన ప్రకారం వరుసగా ఐదు శుక్రవారాలు సాక సమర్పిస్తామని, అందరికీ శుభం చేకూర్చాలని అమ్మవారికి పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయం భక్తులతో కళకళలాడింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు.


బోనాలు, సాకతో వచ్చిన భక్తులు


ఉజ్జయినీ మహాకాళి అమ్మవారు


సాక సమర్పణ సందర్భంగా అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు


ఆదివారం జరిగే బోనాలకు రావాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి ఆహ్వానపత్రిక అందజేస్తున్న చైర్మన్ కళాప్రకాశ్, ఈఓ శ్రీనివాసులు

బోనాలకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

బౌద్ధనగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావి ముత్యాలమ్మ, పోచమ్మ ఆలయంలో ఆదివారం జరిగే బోనాలకు రావాలని ఆలయ చైర్మన్ పరికిబండ కళాప్రకాశ్, ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు మారేడుపల్లి ఎమ్మెల్యే నివాసంలో తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు. రాచమల్ల సంగీత్, పొట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు. సీతాఫల్‌మండి మేడిబావి ముత్యాలమ్మ, పోచమ్మ ఆలయానికి చెందిన ఘట్టం శుక్రవారం పలు పురవీధుల్లో ఊరేగింది. మహిళలు ప్రత్యేక పూజలను చేశారు. ఆలయంలో చైర్మన్ కళాప్రకాశ్ దంపతులు అమ్మవారి ఘట్టానికి పూజలు నిర్వహించారు.


మార్కండేయనగర్‌లో స్థానికులతో సమస్యలపై చర్చిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

మార్కండేయనగర్‌లో కార్పొరేటర్ పర్యటన

బౌద్ధనగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ మార్కండేయనగర్‌లో శుక్రవారం స్థానిక కార్పొరేటర్ సామల హేమ అధికారులతో కలిసి పర్యటించారు. సీసీ రోడ్డు నిర్మాణంలో భాగంగా రోడ్డు తవ్వుతుంటే నల్లా కనెక్షన్ పైపులైన్ పగిలిపోయిందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే పగిలిపోయిన పైపులైన్‌లకు మరమ్మతులు చేపట్టాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు. నాలాల్లో ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తొలగించాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ సూచించారు. జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్ తదితరులున్నారు.


బౌద్ధనగర్ కార్యాలయంలో ఏసీపీ శశాంక్‌రెడ్డిని సత్కరిస్తున్న ఆలయకమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు

ఏసీపీ శశాంక్‌రెడ్డికి సత్కారం


బౌద్ధనగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ కట్టమైసమ్మ, పోచమ్మ ఆలయంతో పాటు వారాసిగూడ, బౌద్ధనగర్, నామాలగుండు తదితర ప్రాంతాల్లో ఆదివారం జరిగిన బోనాలు ప్రశాంతంగా జరగటంతో ఆలయకమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డిని, చిలకలగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అనుదీప్‌ను ఘనంగా సత్కారించారు. బౌద్ధనగర్‌లో ఏసీపీ కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ కందినారాయణ, సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్, బెజ్జంకి రాజేశ్, నాగేందర్ తదితరులు ఏసీపీ శశాంకరెడ్డికి పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సత్కారించారు. చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో అనుదీప్‌ను వారు కలిసి సన్మానం చేశారు.


కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఆగస్టు 3న మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడలు

సికింద్రాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 3న సికింద్రాబాద్ జింఖాన మైదానంలో మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహిస్తున్నామని మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రభుకుమార్‌గౌడ్ తెలిపారు. 30 నుంచి ఆపై వయసు గల గల మహిళలు, పురుషులు పాల్గొంటారని పేర్కొన్నారు. శుక్రవారం కంటోన్మెంట్ బోర్డ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ఆధ్వర్యంలో ప్రభుకుమార్‌గౌడ్, కోశాధికారి లక్ష్మి తదితర సభ్యులు కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్‌ను కలిసి ప్రారంభోత్సవానికి హాజరు కావాల్సిందిగా ఆహ్వాన పత్రికను అందచేశారు. కాగా క్రీడల ప్రారంభోత్సవానికి కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్, మల్లారెడ్డి, మర్రి లక్ష్మణ్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి తదితరులు హాజరవుతారని వెల్లడించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం


గుర్తుతెలియని మృతదేహం


అడ్డగుట్ట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ ప్రాంతంలోని ఓ మురికి కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తిరుమలగిరి ఆర్మీ గేట్ సమీపంలోని మమింగ్‌టన్ రోడ్డు వద్ద ఉన్న మురికి కాలువలో శుక్రవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉందని అటుగా వెళుతున్న ఓ వ్యక్తి పోలీస్ కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతదేహాన్ని బయటికి తీసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ, వివరాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అడ్డగుట్ట చౌరస్తా.. అక్రమ పార్కింగ్‌కు అడ్డా

- ఉదయంపూట తప్పని తిప్పలు
- ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయాలి


అక్రమ పార్కింగ్‌తో అడ్డగుట్ట చౌరస్తాలో ట్రాఫిక్ జాం


అక్రమ పార్కింగ్‌తో ట్రాఫిక్ జాం


గంగా జమునా హోటల్ ముందు అక్రమ పార్కింగ్

అడ్డగుట్ట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ అడ్డగుట్ట చౌరస్తాలో ఉదయం ఆ రెండు గంటలు నరకం అనుభవించాల్సిందే. దుకాణ సముదాయాల ముందు వాహనాల అక్రమ పార్కింగ్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్రమ పార్కింగ్‌తో పాటు అడ్డగుట్ట మజీద్ సమీపంలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు ఏరులై పారుతుండడం, మరోవైపు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండడంతో వాహనదారులు నరకం చూడాల్సి వస్తుంది. గతంలో ఈ చౌరస్తాలో ఉదయం 7 నుంచి 10 వరకు ట్రాఫిక్ సమస్య ఉంటుందని స్థానికులు ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. చౌరస్తాలో ఉదయం పూట ఒక్క కానిస్టేబుల్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని, అలాగే దుకాణ సముదాయాల ముందు అక్రమంగా పార్కింగ్ చేస్తున్నవారిపై చాలన్లు విధించాలని స్థానికులు కోరుతున్నారు.

పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

అడ్డగుట్ట మజీద్ సమీపంలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి ఇరవై నాలుగు గంటలు మురుగునీరు ఏరులై పారుతోంది. కనీసం జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ దారిలో తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్, మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉండగా ప్రతిరోజు వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. సమస్య పరిష్కరించాలని కోరుతూ గతంలో అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్‌కు ఫిర్యాదులు చేసినా ఇంత వరకు సమస్య పరిష్కారం కాలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోజూ నరకమే



ఈ చౌరస్తాలో ప్రతిరోజూ ఉదయం ట్రాఫిక్ జాం, అడ్డదిడ్డంగా పార్కింగ్, మరోవైపు డ్రైనేజీ నుంచి వెలువడుతున్న మురుగునీరు పొంగిపొర్లుతుండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారింది. ఈ సమస్యకు పరిష్కారమార్గం చూపాలి.

- శ్రీకాంత్ నాయక్, అడ్డగుట్ట

అన్నీ సమస్యలే



చిన్నపాటి వర్షం పడితే చాలు అడ్డగుట్ట అతలాకుతలంగా మారుతుంది. అక్రమ పార్కింగ్ కారణంగా వాహనదారులు, స్కూలుకు వెళుతున్న విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇక్కడ ఈ సమస్య తీవ్రతరంగా ఉందని స్థానిక కార్పొరేటర్‌కు తెలిసినా ఇంతవరకు సమస్యను పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- గెల్లు ఉదయ్ యాదవ్, బీజేవైఎం అధ్యక్షుడు

క్రీడలతో విద్యార్థుల మనోస్థైర్యం పెంపు



రుక్మిణీ బాయ్ క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేసిన నిర్వాహకులు పి.జ్యోతి మధుసూదన్‌రావు

మారేడుపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల మనోస్థైర్యాన్ని పెంపొందించి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రుక్మిణి బాయ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న టేబుల్ టెన్నిస్, చెస్, క్యారం బోర్డు, వాలీబాల్ రెండో రోజుకు చేరుకున్నాయి.

క్రీడల్లో పాల్గొని నిష్క్రమించిన, పాల్గొన్న విద్యార్థులకు నిర్వాహకులు గుర్తింపు పత్రాలతో పాటు జ్ఞాపికల అందజేసి అభినందిచారు. కాగా శుక్రవారం జరిగిన క్యారం బోర్డు సీనియర్ బాలుర విభాగం ఫైనల్ పోటీల్లో డీపీఎస్ సికింద్రాబాద్ పాఠశాలకు చెందిన ధావన్ విజేతగా నిలవగా ప్రకాశం విద్యానికేతన్ హై స్కూల్‌కు చెందిన సుశాంత్ రెండోస్థానం, సెయింట్ ప్యాట్రిక్స్ హైస్కూల్‌కు చెందిన మహమ్మద్ సిద్దిక్ మూడోస్థానంలో నిలిచారు. సీనియర్ బాలికల విభాగంలో ప్రకాశం విద్యానికేతన్ హైస్కూల్‌కు చెందిన దయ్యాల మౌనిక ప్రథమస్థానం, రెండు మూడు స్థానాల్లో ఇదే పాఠశాలకు చెందిన జి.కావ్య. జి.రేణుక విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ పి.జ్యోతి మధుసూధనరావులు వారికి నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. శనివారం నుంచి ఫైనల్ పోటీలు నిర్వహిస్తామని అనంతరం గెలుపొందిన జట్లకు క్రీడాకారులకు బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుందని నిర్వాహకులు స్కూల్ కరస్పాండెంట్ పి.జ్యోతి వెల్లడించారు.


లాలాపేట్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి

సీజనల్ వ్యాధులతో అప్రమత్తత తప్పనిసరి

- డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్ రెడ్డి

తార్నాక, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం దృష్ట్యా ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి అన్నారు. శుక్రవారం లాలాపేట్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించిన ఆమె సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి జ్వరాల నియంత్రణకు తీసుకుంటున్న ముందస్తు చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యరంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరిస్తుందని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో డిజిటల్ హెల్త్ రికార్డ్స్, మొబైల్ డయాగ్నస్టిక్ వంటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ప్రతి ఒక్క డివిజన్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్లలో సదుపాయాలను మెరుగుపరచడటమే మాతృసేవలు, పిల్లల ఆరోగ్య పరీక్షలు, టీకాలు, మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని వివరించారు.



జ్యోతి ప్రజ్వలన చేసి సాంకేతిక పరికరాన్ని ఆవిష్కరించిన సినీనటి లయ

ఫర్టీ9లో ఏఐ అథారిటీ మేల్ ఫెర్టిలిటీ టెస్టింగ్ ప్రారంభం

మారేడుపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం సందర్భంగా 9 ఫెర్టిలిటీ మగవారి వీర్య కణాలను ఏఐ టెకాలజీ ద్వారా పరీక్షించేందుకు లెన్స్ ఎక్స్ 12ప్రో సాంకేతికను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సికింద్రాబాద్ సెంటర్ సీఈఓ వినేష్ గడియా తెలిపారు. ప్రస్తుతం సంస్థ తీసుకువచ్చిన ఏఐ టెక్నాలజీ ద్వారా నిమిషాల వ్యవధిలో వేల సంఖ్యలో వీర్య కణాలను పరిశీలించి డీఎన్ఏ లోపాలను గుర్తించవచ్చని సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ నటి లయ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి టెక్నాలజీ సాంకేతిక పరికరాన్ని ఆమె సెంటర్ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు.


మీడియాతో మాట్లాడుతున్న మహేందర్ రెడ్డి, గబ్బర్ సింగ్ టీమ్ సభ్యులు

మహాకాళి ఆలయంలో జనసేన నాయకుల పూజలు

రాంగోపాల్‌పేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : హరిహర వీరమల్లు సక్సెస్‌తో త్వరలో ఏపీ ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారిని దర్శించుకుంటారని టీటీడీ బోర్డు సభ్యుడు, జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం గబ్బర్‌సింగ్ టీం, జనసేన పార్టీ నాయకులతో కలిసి సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళి అమ్మవారి దేవస్థానంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొందరు సినిమాపై విమర్శలు చేస్తున్నారని అది తగదన్నారు. త్వరలో దేశంలో యాక్టివ్ పాలిటిక్స్‌లో పవన్‌కళ్యాణ్ గారు ఉంటారన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ జనసేన అధ్యక్షులు రాదారం రాజలింగం, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రేమ్ కుమార్, తెలంగాణ వీర మహిళ చైర్మన్ మండపాక కావ్య, నాయకులు దామోదర్ రెడ్డి, సురేష్ రెడ్డి, వీర్ల రమేష్, గబ్బర్ సింగ్ టీమ్ సాయి బాబా, రమేష్, రేన్షన్ రాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

లోన్ ఇప్పిస్తానని మోసం.. నిందితుడి అరెస్ట్

రాంగోపాల్‌పేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకు ద్వారా రూ.5 కోట్లు లోన్ ఇప్పిస్తానని నమ్మించి ఓ బాధితుడి నుంచి రూ.75 లక్షలు వసూలు చేసి మోసానికి పాల్పడిన ఓ వ్యక్తిని మహంకాళి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్‌కు చెందిన శ్రవణ్‌కుమార్(34) మచ్చ బొల్లారం నివాసి. అవసరమైన వారికి బ్యాంకుల ద్వారా లోన్లు ఇప్పిస్తూ కమీషన్లు తీసుకుంటూ జీవిస్తున్నాడు. ఏఎస్‌రావునగర్‌కు చెందిన అనిల్ కుమార్ జేసీబీలు తీసుకుందామని ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో తెలిసిన వారి ద్వారా అనిల్‌కుమార్‌కు బ్యాంకుల్లో లోన్లు ఇప్పించే శ్రవణ్‌కుమార్ పరిచయమయ్యాడు. తాను జేసీబీలు తీసుకోవడానికి లోన్‌లు ఇప్పిస్తానని, తనకు 12 శాతం కమీషన్ కావాలని శ్రవణ్‌కుమార్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. లోన్‌లు ఇప్పిస్తున్నట్లుగా తప్పుడు వర్క్ ఆర్డర్లు తయారు చేసి, బ్యాంకు ద్వారా అనిల్‌కుమార్ అకౌంట్‌కు బదిలీ అవుతున్నట్లు పత్రాలను సృష్టించాడు. శ్రవణ్ కుమార్ సరోజిని దేవి రోడ్డులోని సింద్ బేకరీ వద్ద అనిల్‌కుమార్‌ను కలిసి పలు దఫాలుగా రూ.75 లక్షలు తీసుకున్నాడు. తనకు లోన్ రాకపోవడంతో పాటు ఇచ్చిన పత్రాలు నకిలీవని తెలుసుకున్న అనిల్‌కుమార్ మహంకాళి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చీటింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

బేగంపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సనత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌కు చెందిన అవినాష్ సమీపంలోని మద్యంషాపుల నుంచి మద్యం కొనుగోలు చేసి వాటిని అధిక ధరలకు విక్రయిస్తుంటాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సనత్‌నగర్ పోలీసులు అవినాష్ ఇంట్లో సోదాలు జరపగా మద్యం బాటిళ్లు దొరికాయి. ఓల్డ్‌మంక్(180ఎంఎల్) 8, ఓసీ మంక్ (90ఎంఎల్) 8, డైమండ్ ఫైన్ (180ఎంఎల్) 40, హైవిస్కీ (180ఎంఎల్) 5, మ్యాజిక్ మూమెంట్ (180ఎంఎల్) 15 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అవినాష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ

మల్కాజిగిరి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌కు చెందిన త్రిశక్తి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నేరేడ్‌మెట్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదో తరగతికి చెందిన 135 విద్యార్థినీ, విద్యార్థులకు ఉపకరణాలను పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలు అందజేయటంతో స్కూల్ హెచ్‌ఎం చారి కృతజ్ఞతలు తెలిపారు. ఇకనుంచి పదో తరగతిలో మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్ని కూడా అందించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందని సేవా సమితి అధ్యక్షురాలు సూర్యకుమారి తెలిపారు.


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును సత్కరిస్తున్న నగర గంగపుత్ర సంఘం నాయకులు

బోనాల పండుగకు ఆహ్వానం

బౌద్ధనగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన రామచంద్రరావును శుక్రవారం వారాసిగూడ నగర గంగపుత్ర సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. రామచంద్రరావుకు పుష్పగుచ్ఛాలందజేసి శాలువాలు కప్పి సత్కారించారు. ఈ నెల 27న నాంపల్లిలో హైదరాబాద్ నగర గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో జరిగే బోనాల పండుగలో పాల్గొనాలని బీజేపీ అధ్యక్షుడిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా కార్యదర్శి మద్దెర్ల శ్యాంసుందర్, రాష్ట్ర గంగపుత్ర సంఘం నాయకులు ఎర్రబోయిన మల్లేష్, నీలి యాదగిరి, ముతాగణేశ్, ముద్రగడ గిరిధర్, శంకర్, రాజ్‌కుమార్, సంజీవ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ రైల్వే ఉద్యోగి ఇంటిలో విరబూసిన బ్రహ్మకమలం

చిలకలగూడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అరుదైన బ్రహ్మ కమలం పూలు ఓ మాజీ రైల్వే ఉద్యోగి గణపవరపు కోటేశ్వరరావు ఇంట్లో శుక్రవారం విరబుసాయి. ఉప్పల్, కె.యల్.రెడ్డి నగర్‌లో నివాసముండే ఆయన రైల్ నిలయం ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహించారు. ఆయన ప్రకృతి ప్రేమికుడు. ఇంటిని నందనవనంగా మార్చి వివిధ పూల, పండ్ల మొక్కలతో పాటు బ్రహ్మకమలం పూల మొక్కను పెంచాడు. ఒకటి కాదు రెండు కాదు మూడు పూలు పూయటంతో చుట్టు పక్కలవారు, బంధువులు, మిత్రులు ఆసక్తిగా అందమైన పూలని చూసి తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకున్నారు. తెల్లగా, అందంగా ఉండే ఇవి పూసిన తర్వాత తొందరగా వాడిపోతుందని ఆయన తెలిపారు.


బ్రహ్మకమలం పూలు